నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | జూన్ 10, 2024 | www.navatelangana.com

నేటి నుంచి ప్రజావాణి పున:ప్రారంభం

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీ నుండి యథావిధిగా నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినా ఫిర్యాదులు స్వీకరించినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమం నేటి సోమవారం (10వ తేదీ) నుంచి తిరిగి యథావిధిగా ప్రతిసోమవారం నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను లేదా సమస్యలను నేరుగా ప్రజావాణిలో అందజేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు కామారెడ్డిలో జాబ్ మేళా

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రయివేటు రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నేడు (10న) కామారెడ్డి కలెక్టరేట్ లోని ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని వరుణ్ మోటార్స్ కంపెనీ నందు పలు పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇట్టి పోస్టులకు 25 నుండి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఇంటర్, మెకానిక్ ట్రేడ్ నందు డిప్లొమా/ఏదేని డిగ్రీ/ బిటెక్ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు 14 వేల నుండి 25 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత ఈ నెల 10 న ఉదయం 10.30 నుండి మధ్యాన్నం 2 గంటల వరకు కలెక్టరేట్ లోని మొదటి అంతస్తులో 121 గదిలో గల ఉపాధి కల్పనా కార్యాలయం నందు ,విద్యార్హత ధ్రువపత్రాలు,ఆధార్ కార్డులు, ఫొటోలతో హాజరు కావాలని మధుసూదన్ సూచించారు. మరిన్ని వివరాలకు 9848237987 లేదా 7671974009 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.



కాంగ్రెస్‌లో గ్రూపు పోరు

- అందుకే ఎల్లారెడ్డిలో కాంగ్రెస్‌కు ఓట్లు తగ్గినట్టు క్యాడర్ పెదవివిరుపు
- తాజాగా సమీక్ష సమావేశం నిర్వహించగా.. ముగ్గురు నాయకుల నుంచి వేర్వేరు ప్రకటనలు



నవతెలంగాణ-రామారెడ్డి

కాంగ్రెస్‌లో వర్గ పోరు మరోసారి భగ్గుమంది. నాయకులు రెండు గ్రూపులుగా విడిపోవడంతో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. నాయకులు గ్రూప్ తగాదాలతో ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓట్ల శాతం తగ్గినట్టు కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..

ఎల్లారెడ్డి నియోజకవర్గంతో పాటు రామారెడ్డి మండలంలో అసెంబ్లీ ఎన్నికల కంటే, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల శాతం తగ్గడానికి గల కారణాలను విశ్లేషించేందుకు ఆదివారం పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల కంటే, పార్లమెంటు ఎన్నికల్లో రామారెడ్డి మండలం తో పాటు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఓటింగ్ శాతం తగ్గడానికి గల కారణాలను విశ్లేషించేందుకు సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మోహన్‌రెడ్డి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయితే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శీల సాగర్ స్పందిస్తూ అపరిచిత వ్యక్తుల సమావేశానికి మదనన్న సైన్యం వెళ్లకూడదని ప్రకటించారు. దీంతో పాటు పార్టీ మండల అధ్యక్షులు లక్ష్మా గౌడ్ స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ సమావేశాలు ఏమీ లేవని, ఎవరైనా పార్టీకి విరుద్ధంగా పనిచేస్తే చర్యలు తీసుకుంటామని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో మండలంలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. గ్రూప్ తగాదాలతో పార్టీకి తీవ్ర నష్టం చేకూరే అవకాశం ఉందని కార్యకర్తలు భావిస్తున్నారు. అధికారంలో ఉన్న సమయంలో ఐక్యంగా పార్టీ ప్రతిష్టను పెంచేలా పని చేయాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా పనిచేస్తే పార్టీకి నష్టం చేకూరే అవకాశం ఉంది. పార్టీ రాష్ట్ర కమిటీ దృష్టిసారించి గ్రూప్ తగాదాలను నిలువరించి పార్టీ ప్రతిష్టతను పెంచేలా నాయకులను ఐక్యం చేయాలని కార్యకర్తలు కోరుతున్నారు.

కష్టపడ్డ కార్యకర్తలకు గుర్తింపు లేకపోతే పార్టీకి నష్టం : జడ్పీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి

అనంతరం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో నారెడ్డి మోహన్‌రెడ్డి మాట్లాడారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులకు, కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు లేకనే ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఓటింగ్ శాతం తగ్గిందని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ధర్నాలు ర్యాలీలు చేస్తూ కేసులైన భయపడకుండా పార్టీ అధికారంలోకి వచ్చే వరకు కొట్లాడితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. పార్టీలోకి ఎవరు వచ్చినా స్వాగతిస్తామని, కానీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలు గమనిస్తున్నారని, ప్రతిపక్షాలు మండలంలో ఆరోపణలు చేస్తే, వారికి కౌంటర్ ఇవ్వవలసిన నాయకులు, అది మానుకొని సొంత పార్టీ నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరు భయపడవద్దని, ఎవరికి ఆపద వచ్చినా 24 గంటలు మీకు అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గీ రెడ్డి మహేందర్ రెడ్డి, అంబాయి ప్రసాద్, నామాల రవి, వడ్ల లక్ష్మీరాజం, నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, చింతకుంట కిషన్, నర్సింగరావు, బి పేట నర్సింలు, అనీఫ్, ఎల్లయ్య, పోతుల భాస్కర్‌రెడ్డి, పరుశు రాం, ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

బడి బస్సు భద్రమేనా..?

- పలు చోట్ల కాలం చెల్లిన బస్సులు, మినీ వ్యానులు
- రవాణా శాఖ మేల్కొంటేనే మేలు
- ఫిట్‌నెస్ లేకుండా తిప్పితే ప్రమాదమే
- తనిఖీలు చేపడితేనే ప్రయోజనం



నందిపేట్‌లోని ఓ స్కూల్ బస్సు

నవతెలంగాణ-నందిపేట్

మరో రెండు రోజుల్లో నూతన విద్యాసంవత్సరం పున:ప్రారంభం కానుంది. ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లు బుధవారం నుంచి తెరుచుకో నున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయివేట్ పాఠశాలల బస్సులు ఫిట్ నెస్ పరీక్షలు చేసుకోకుండానే రోడ్డుపై తింపే అవకాశం ఉంది. రవాణాశాఖ అధికారుల లెక్కల మేరకు బడి బస్సులు 60 శాతం మాత్రమే ఫీట్ గా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు విద్యాసంస్థల బస్సులకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం లేకపోలేదు. రవాణా, విద్యాశాఖ అధికారులు ముందే మేల్కొంటే పెనుప్రమాదాలను అరికట్టే అవకాశం ఉంది.

పాటించాల్సిన నిబంధనలు

బడి బస్సులకు సంబంధించి ప్రభుత్వం జీవో ఎంఎస్ నం: 35 ప్రత్యేకంగా జారీ చేసింది. 32 అంశాలతో కూడిన నిబంధనలు అమలు చేయాలని సూచించింది. అందులో కొన్ని ఏంటో చూద్దాం.

- → పాఠశాల, కళాశాల బస్సు ముందు భాగం ఎడమ పక్కన పేర్లు ఫోన్ నెంబర్లు ఇతర వివరాలు స్పష్టంగా రాసి ఉంచాలి.
- → తలుపునకు సురక్షిత లాకింగ్ విధానం ఏర్పాటు చేయాలి
- → బస్సు ఎక్కడానికి మెట్లు 3.25 మిల్లీమీటర్ ఎత్తులో ఉండాలి. పిల్లలు ఎక్కడానికి, దిగడానికి ఒక సహాయకుడిని నియమించాలి.
- → డ్రైవరు వయస్సు 60 ఏళ్లకు మించరాదు. ఆయన ఆరోగ్య పట్టికను విధిగా నమోదు చేయాలి తల్లిదండ్రుల కమిటీకి డ్రైవర్ నియామకంపై వివరాలు తెలుపాల్సి ఉంటుంది.
- → బస్సు సామర్థ్యంపై పాఠశాల ప్రిన్సిపాల్ తల్లిదండ్రుల కమిటీ నెలకు ఓసారి పరిశీలించాలి. ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేయాలి.
- → విద్యార్థుల వివరాలు విధిగా నమోదు చేయాలి ఒక అటెండర్‌ను తప్పనిసరిగా నియమించాలి.
- → అత్యవసర ద్వారం ఉండాల్సిందే.
- → అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలు ఆర్పేందుకు వీలుగా అగ్నిమాపక సిలిండర్ అందుబాటులో ఉంచాలి.

సగం బస్సులు అరిగిన టైర్లతోనే ఉన్న వైనం

జిల్లా వ్యాప్తంగా 473 ప్రయివేటు స్కూళ్లు ఉన్నాయి. వీటిల్లో కొన్ని స్కూళ్లకు పదుల సంఖ్యలో బస్సులు ఉండగా.. మండల, డివిజన్ కేంద్రాల్లోని స్కూళ్లకు ఒకటి నుంచి రెండు బస్సులు ఉన్నాయి. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా సుమారు 1000 నుంచి 1200 ప్రయివేటు స్కూల్ బస్సులు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి మాత్రమే ఫిట్ నెస్ పరీక్షలు నిర్వహించారు. గతంలో ఏడాదికి ఒక్కసారి ఏప్రిల్, మే నెలలో పరీక్షలు చేయాలనే నిబంధన ఉండేది. తాజాగా దీన్ని రెండేళ్లకు పొడిగించారు. ప్రస్తుతం మూడేళ్లయిన ఫిట్ నెస్ పరీక్షలు చేయకుండానే ఎన్నో బస్సులు తిరుగుతున్నట్టు సమాచారం. మరి కొన్ని పాఠశాల యాజమాన్యాలు ఫిట్ నెస్ లేని మినీ వ్యాన్‌లను ఏడాదికి ఇంత డబ్బు ఇస్తామని ముందే సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టి ఫిట్ నెస్ లేని బస్సులతో పాటు పల్లెల్లో తిప్పె మినీ వ్యాన్‌లపై ప్రత్యేక డ్రైవ్ చేయాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫిట్ నెస్ తప్పనిసరి

మినీ వ్యాన్ ఫిట్ నెస్ కోసం రవాణా శాఖ రెండు ఏండ్లకు రూ.3000 వసూలు చేస్తోంది. బస్సులకు ఐతే సుమారు రూ.2000 ఏడాదికి ఖర్చు అవుతుంది. యాజమాన్యానికి ఫిట్ నెస్‌లో లోపాలు ఉంటే మరింత భారం పడనుంది. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం పసుపు రంగు నంబరు ప్లేటు ట్యాక్సీ వాహనాలకు తప్పనిసరిగా స్పీడ్ గవర్నర్స్ ఏర్పాటు చేయించాలి. ప్రస్తుతం ఉన్న బస్సుల్లో సగానికి పైగా బిగించలేదు. ప్రవేట్ ఏజెన్సీల ద్వారా ఈ పరికరాలను ఏర్పాటు చేసేందుకు 3 నుంచి నాలుగు వేలు చెల్లించాలి. మొత్తం బస్సు ఫిట్ నెస్ పూర్తి చేసేందుకు సర్వీసింగ్, ఇతర మరమ్మతులకు ఒక్కోదానిపై రూ. 25 వేల వరకు వెచ్చించాల్సి ఉండటంతో ఫిట్‌నెస్ జోలికి వెళ్లడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఫిట్‌నెస్ లేకపోతే.. విద్యార్థులను తీసుకొచ్చి తిరిగితీసుకెళ్లే వేళ ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుకోని ప్రమాదాలు కుటుంబాలకు తీరని శోకం కల్పించిన వారవుతారని పేర్కొంటు న్నారు. ఆర్టీవో, విద్యాశాఖ, పోలీస్ అధికారులు స్పందించి బస్సుల తనిఖీ చేపట్టి ఫిట్‌నెస్ లేని బస్సులను గుర్తించాలని కోరుతున్నారు.


అరిగిపోయిన బస్సు టైర్

తుప్పు పట్టిన ప్రభుత్వ వాహనాలు

- మరమ్మతులకు నోచకపోవడంతో వృథాగా మారిన వైనం


తుప్పుపట్టిన వాహనాలు



నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వ అధికారులు గ్రామాల్లో వివిధ పనులపై అభివృద్ధి పనులను పర్యవేక్షించ డానికి కార్యక్రమాల్లో పాల్గొన డానికి ప్రభుత్వాలు అధికారులకు ప్రత్యేక వాహనాలను కేటాయింస్తుంటాయి. దాంతో కొన్ని సంవత్సరాల వరకు ప్రభుత్వ వాహనాలను ఉపయోగించుకున్న అధికారులు అవి రిపేర్ కు రాగానే వాటిని షెడ్డులోనే పక్కన పెట్టేశారు. దాంతో సంవత్సరాల తరబడి ప్రభుత్వ వాహనాలు మరమ్మతులకు నోచుకోక తుప్పు పట్టి పోయాయి. ప్రస్తుతం అవి దేనికి పనికి రాకుండా పోవడంతో వృధాగా మారిపోయాయి. బోధన్ ఎంపీడీఓ కార్యాలయంలో, గ్రామీణ నీటిపారుదల శాఖ కార్యాలయంలో రెండు వాహనాలు తుప్పుపట్టి వృధాగా మారాయి. ప్రభుత్వ వాహనాలు మూలన పడడంతో అధికారులు అద్దె వాహనాలను ఉపయోగిస్తున్నారు.

మార్కెట్ యార్డు సెక్యూరిటీ గార్డుపై దాడి

బీజేపీ నాయకుడి దుశ్చర్య


సీసీ కెమెరాలో దాడి ఘటన రికార్డు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

శ్రద్ధానంద్ గంజ్‌లోని మార్కెట్ యార్డులో మద్యం సేవించొద్దని సూచించిన సెక్యూరిటీ గార్డులో బీజేపీ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. గత నెల 31వ తేదీనా రాత్రి సమయంలో 16వ డివిజన్ కార్పొరేటర్ భర్త పంచారెడ్డి శ్రీధర్ శ్రద్ధానంద్ గంజ్‌లో పలువురితో కలిసి మద్యం సేవించాడు. అయితే అక్కడే పెట్రోలింగ్‌లో ఉన్న సెక్యూరిటీ గార్డు అక్కడ మద్యం సేవించొద్దు వెళ్లిపోండని రెండుసార్లు చెప్పినా వినకుండా సేవించారు. అనంతరం వెళ్లిపోయి తిరిగి రాత్రి 11 గంటల సమయంలో సెక్యూరిటీ గార్డ్‌పై దాడికి దిగినట్టు వారు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 15 మంది వరకు వచ్చి దాడి చేయడంతో సందీప్, లక్ష్మణ్ అనే సెక్యూరిటీ గార్డులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఇంత జరిగినా ఇప్పటి వరకు సదరు మర్చంట్ అసోసియేషన్ కానీ, పోలీసులు కానీ, మార్కెట్ కమిటీ అధికారులు స్పందించకపోవడం గమనార్హం. రాజకీయం అండతో నాయకులు ఏది చేసినా చెల్లుబాటు అవుతుందని భ్రమలో ఉంటే.. ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సెక్యూరిటీ గార్డులు కోరుతున్నారు.

గ్రూప్ -1 ప్రిలిమినరీ ప్రశాంతం

- నిజామాబాద్‌లో 2888, కామారెడ్డిలో 1017 మంది అభ్యర్థులు గైర్హాజరు
- కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్‌లు తరలింపు
- పర్యవేక్షించిన కలెక్టర్‌లు, అధికారులు


నిజామాబాద్‌సిటీ : పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ద్వారా ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణకు అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా కొనసాగాయి. కలెక్టర్‌లు, అధికారులు పలు కేంద్రాలను పరిశీలించారు. కాగా నిజామాబాద్ జిల్లాలో 77.49 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. మొత్తం 12,833 మంది అభ్యర్థులకు గాను 9945 మంది పరీక్ష రాయగా, 2888 మంది గైర్హాజరయ్యారని వివరించారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,797 అభ్యర్థులకు గాను 3,780 మంది అభ్యర్థులు హాజరుకాగా 1,017 మంది గైర్ హాజరయ్యారు. జిల్లాలో 78.79 శాతం అభ్యర్థులు హాజరైనట్టు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు.

అంతకుముందు ఇరు జిల్లా కేంద్రాల్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని స్ట్రాంగ్ రూమ్ నుండి కట్టుదిట్టమైన పోలీసు భద్రత నడుమ మూడు రూట్ల ద్వారా ప్రశ్న పత్రాలు, ఇతర సామాగ్రిని పరీక్షా కేంద్రాలకు తరలించారు. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష కొనసాగగా, పరీక్ష ముగిసిన అనంతరం అభ్యర్థుల ఓ.ఎం.ఆర్ షీట్లు, ఇతర మెటీరియల్‌ను నిబంధనలకు అనుగుణంగా సీల్ వేసి, పోలీస్ ఎస్కార్ట్ నడుమ తిరిగి స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఈ ప్రక్రియను ఇరు జిల్లాల్లో అదనపు కలెక్టర్‌లు కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించారు. కాగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్‌లు

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాలను నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాణిక్ బండార్ సమీపంలో గల కాకతీయ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలతో పాటు, ఎస్.ఆర్ కాలేజీలో కొనసాగుతున్న గ్రూప్-1 పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరు, సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? లేదా? అన్నది నిర్ధారణ చేసుకు న్నారు. బయో-మెట్రిక్ హాజరు సేకరణ కోసం ప్రత్యేకంగా నియమించ బడిన ఇన్విజిలేటర్లను పిలిపించి, బయో-మెట్రిక్ సేకరణలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ప్రాథమిక చికిత్స వసతులతో కూడిన ఏ.ఎన్.ఎం బృందాలు అందుబాటులో ఉన్నారా లేదా అని గమనించారు. అభ్యర్థుల హాల్ టికెట్లను ఆధార్ వంటి గుర్తింపు కార్డులతో సరిచూసుకున్న మీదటే, మెయిన్ ఎంట్రెన్స్ వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించినట్టు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎగ్జామ్ హాల్లోకి సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేనందున అభ్యర్థులను మెటల్ డిటెక్టర్లతో క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. కలెక్టర్ ఆయా పరీక్షా కేంద్రాల్లోని గదులను సందర్శిస్తూ, అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించి ముఖ్య పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు.

కామారెడ్డిలోని స్థానిక డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏ, బి బ్లాకులు, ఎస్ ఆర్ కే డిగ్రీ కాలేజీ, వి ఆర్ కే డిగ్రీ కాలేజీ, ఆర్ కే డిగ్రీ కాలేజీ, వశిష్ట డిగ్రీ కాలేజీ, వశిష్ట జూనియర్ కాలేజీ లో ఏర్పాటుచేసిన కేంద్రాలను కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పరిశీలించి పరీక్ష నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించారు. బయోమెట్రిక్ ద్వారా అభ్యర్థుల హాజరు, అభ్యర్థుల తనకి, హాజరు, మౌలిక వసతులను పరిశీలించి, నిర్ణీత సమయంలో ప్రశ్నా పత్రాల పంపిణీ చేశారా. ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా వంటి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి క్షేత్రస్థాయిలో ఉండి పర్యవేక్షించారు. డిగ్రీ కాలేజ్ ప్రధాన చార్యులు విజయ్ కుమార్ ఈ పరీక్షలకు రీజనల్ కోఆర్డినేటర్ గా వ్యవహరించారు.


కామారెడ్డిలో బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్పీ సింధుశర్మ

ఐఐటీ అడ్వాన్స్‌లో మెరిసిన కాకతీయ విద్యార్థులు


Md. Minahaj


A Tejaswini


M. Supreeth


J. Kethana


D. Siddartha


A. Hadi



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఐఐటీ అడ్వాన్స్‌డ్ జాతీయ పరీక్ష ఫలితాల్లో నగరంలోని కాకతీయ విద్యార్థులు మెరిసారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో కాకతీయ విద్యాసంస్థలో 2024లో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని వెంటనే ఇంటర్‌తో పాటు తొలి ప్రయత్నంలోనే డైరెక్టుగా ఐఐటి అడ్వాన్స్‌డ్ జాతీయ పరీక్షా ఫలితాలలో కాకతీయ విద్యార్థులు మిన్హాజ్ 438 ర్యాంకు, ఎ. తేజశ్విని 856 ర్యాంకు, సుప్రీత్ 3407 ర్యాంకు, జె. కీర్తన 3740 ర్యాంకు, సిధార్థ 4906 ర్యాంకు, హడి 5102 ర్యాంకులతో అద్భుతమైన ఫలితాలు సాధించారని కాకతీయ విద్యాసంస్థల చైర్మెన్ సి.హెచ్. విజయలక్ష్మి తెలిపారు. ఇలా అనేక మంది కాకతీయ విద్యార్థులు 2024 ఇంటర్ తో పాటు తొలి ప్రయత్నంలోనే కాకతీయ విద్యాసంస్థ డైరెక్టర్లు, అధ్యాపకుల కృషితో ఇంతటి అద్భుత ఫలితాలు సాదించారని అన్నారు. 90 శాతం పైన 17 మంది కాకతీయ విద్యార్థులు ఐఐటి మెయిన్స్ 2024 ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. ఇంతటి అద్భుతమైన విజయాలకు కారకులైన కాకతీయ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రశంసించారు. విశేషమైన కృషినందించిన అధ్యాపక బృందానికి, ప్రోత్సాహాన్ని అందించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ (ఐఐటియన్) సి.హెచ్. రామోజీ రావు మాట్లాడుతూ ఈ సంవత్సరం జెఇఇ మెయిన్స్ 2024 ఫలితాలలో, ఆదివారం ప్రకటించిన 2024-ఐఐటి అడ్వాన్స్ జాతీయ పరీక్షా ఫలితాలలో వివిధ కేటగిరిలలో అత్యుత్తమ ఫలితాలు సాధించి జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు సత్తా చాటినట్టు తెలిపారు. ఇందుకు కృషిచేసిన అందరికి, కాకతీయ అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో ఐఐటి అధ్యాపక బృందం, కాకతీయ విద్యాసంస్థల ప్రిన్సిపల్స్ వి. రణధీష్, సందీప్ కులకర్ణి, వైస్ ప్రిన్సిపల్ శ్యాం, జ్యోత్స్న పాల్గొన్నారు. ఇంతటి అద్భుత ఫలితాలు సాధించటానికి కారకులైన అధ్యాపక బృందానికి, తల్లిదండ్రులకు, విద్యార్థులకు కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్లు సి.హెచ్. రాజ, సిహెచ్ తేజశ్విని అభినందనలు తెలిపారు. బిడ్డల్ని ప్రేమించే తల్లిదండ్రులకు.. ఆ బిడ్డల భవితకు రూపమిచ్చే కాకతీయ అధ్యాపక బృందానికి.. ఈ ఫలితాలు తరగని, చెరగని ఆత్మీయ బంధాలుగా నిలుస్తామని సంస్థ చైర్పర్సన్ సిహెచ్ విజయలక్ష్మి అన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
సోమవారం | జూన్ 10, 2024 | www.navatelangana.com

గ్రామదేవతలకు జలాభిషేకం


పూజలు చేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-బాల్కొండ
మండల కేంద్రంలోని ప్రజలు ఆదివారం గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. గోదావరి నుంచి జలాలను తీసుకువచ్చి గ్రామంలోని దేవుళ్లకు జలాభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామస్తులందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులతోపాటు అన్ని కులాల వారు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతి ఆలయంలో యజ్ఞం

నవతెలంగాణ-మోపాల్
బోర్గం (పి) శివారులో గల శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం శ్రీ సూక్త యజ్ఞం, సిద్ధి, బుద్ధి గణపతి కళ్యాణం తదితర కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్టు ఆలయ వ్యవస్థాపకులు అరుణ్ కుమార్ శర్మ తెలిపారు.



వ్యకాస రాష్ట్ర సదస్సు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఈనెల 9, 10 న జరిగే రాష్ట్ర కమిటీ సమావేశాలు ఇదే నెల 23, 24 కి మార్చామని, దీన్ని గమనించాలని శ్రేయోభిలాషులకు, జిల్లా ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభమైనా క్రమంలో వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, అలాగే రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ఈనెల 10 న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు గ్రామీణ అభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖ మాత్యులు సీతక్క, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, ఉపాధ్యక్షులు ప్రసాద్, బొప్పని పద్మ హాజరవుతున్నారని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలోని వ్యవసాయ కూలీలు అధిక మొత్తంలో పాల్గొని జయప్రదం చేయాలని సంఘం జిల్లా కమిటీ కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, జిల్లా ఉపాధ్యక్షులు గోశం లక్ష్మి, సహాయ కార్యదర్శి ఎన్. నాగుల గోవర్ధన్, ఎస్. సాయిలు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ హక్కులకోసం పోరాటం చేస్తాం

- ఎస్టీయూ


మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ఉపాధ్యాయ హక్కులకోసం నిరంతరం పోరాటం చేస్తామని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ధర్మేందర్ అన్నారు. ఆదివారం సంఘా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్టియు భవన్‌లో సంఘం పతకాన్ని జిల్లా అధ్యక్షులు ధర్మేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం ప్రభుత్వంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాడానికి మగ్దూం మొయినుద్దీన్ 1947లో ఏర్పాటు చేసిన సంఘం స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టియు) అప్పటి నుంచి నిరంతరం ఉపాధ్యాయుల హక్కులకోసం పోరాడుతుందని, మొదటగా పిఆర్సి, డిఎ, పెన్షన్‌లను సాధించి పెట్టిన సంఘం ఎస్టియు అని అన్నారు. ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేవిధంగా భౌతికశాస్త్రం, ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ ప్రతి ఉన్నత పాఠశాలలో ఉండాలని మొదటగా చెప్పి దానిని సాధించడం జరిగిందని తెలిపారు. ఎస్టియు ముందు తరం నాయకులైన కాళోజీ, ప్రో.జయశంకర్ సార్, పూర్వ ఎమ్మెల్సీ వాణి విజయరామారావు, రామమూర్తి, రాష్ట్ర జిల్లా పూర్వ అధ్యక్ష కార్యదర్శులు బాటలో నడిచి సంఘ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బెల్లాల్ శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు మహేశ్వర్, రత్నాకర్, గంగకిషన్, పవన్ కుమార్, సన ఉద్దీన్, చంద్రశేఖర్, మల్లయ్య, వెంకట్‌నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ ఉద్యోగికి ఘనంగా వీడ్కోలు


ఉద్యోగిని సన్మానించిన పలువురు

నవతెలంగాణ-నందిపేట్
ఐకేపీలో సిసిగా విధులు నిర్వర్తిస్తున్న సరోజ ఉద్యోగ విరమణ పొందారు.ఆదివారం ఆమెకు సిర్పూర్ గ్రామంలో మహిళలంతా శాలువాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. 20 సంవత్సరాలుగా అన్నారం, సిర్పూర్, డొంకేశ్వర్, నికాల్‌పూర్ గ్రామాల్లోని వివోల బాధ్యతలను చూస్తూ గ్రామాలకు కమ్యూనిటీ కోఆర్డినేటర్ (సీసీ) ఐకెపి డిపార్ట్మెంటులో విధులు నిర్వహించారన్నారు. కొత్త సంఘాల ఏర్పాటు, సభ్యులను సంఘాలలో చేర్పించేందుకు అంకిత భావంతో పని చేశారన్నారు. ఆమె తోటి మహిళలకు అందించిన సాయాన్ని మరువలేమన్నారు.

మెగా శాఖాహార భారీ ర్యాలీ

నవతెలంగాణ-ఆర్మూర్
డివిజన్ లోని వెల్మల్ గ్రామంలో ధ్యాన బంధువుల ఆధ్వర్యంలో అహింసాయుత మెగా శాకాహార ర్యాలీ ఆదివారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జ్ఞానదాత మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్టు సభ్యులు శ్రీలక్ష్మి హైదరాబాద్ హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పిరమిడ్ మెడిటేషన్ చానల్ చూడాలని ధ్యానం చేయాలని అన్నారు. ధ్యానం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని, ధ్యానం ప్రతిరోజు క్రమం తప్పకుండా చేసి అద్భుతమైన ఫలితాలను పొందాలన్నారు. కార్యక్రమంలోపి ఎస్ ఎస్ ఎమ్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి, సిద్దేశ్వర పిరమిడ్ చైర్మన్ తిరుమల గంగారం,, మామిడి లక్ష్మారెడ్డి , అమరవాజీ శ్రీనివాస్ , నాగంపేట శ్రీనివాస్, 500 మంది పాల్గొన్నారు.

నీట్ ఫలితాల అవకతవకలపై దర్యాప్తు జరపాలి

పిడిఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న పిడిఎస్‌యూ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
నీట్ 2024 పరీక్ష ఫలితాల అవకతవకలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి దర్యాప్తు జరపాలని పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్.గౌతమ్ కుమార్, జన్నారపు రాజేశ్వర్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో పత్రికా విలేకరుల సమావేశం ఆదివారం నిర్వహించారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకై ఫలితాల్లో స్కామ్ జరిగినట్లుగా విద్యార్థులు ఆరోపిస్తున్నరాని తెలిపారు. ఒకే పరీక్ష కేంద్రంలో ఆరుగురు విద్యార్థులకు 720/720 మార్కులు రావడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. 67 మందికి ఎలా టాప్ ర్యాంకులు వస్తాయని, ఒక్కో పరీక్ష పత్రం లీకేజీలో లక్షల రూపాయలు చేతులు మారాయని, లక్షలాదిమంది జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలు అయ్యాయని, కావున సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు కార్తీక్, దేవిక జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, నాయకులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంజలి, కార్యదర్శి రఘురాం డిమాండ్ చేశారు. దాదాపు దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్షను రాశారని,

ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వారి అనుమానాలకు సజీవ సాక్ష్యం ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం, వారి పరీక్ష కేంద్రం ఒకటే కావడం వల్ల అనుమానాలకు బలాన్నిస్తుందని తెలిపారు. కావున తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని, దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వానికి చెప్పిన కూడా వారి మాటని పెడచెవిన పెట్టి, నిర్లక్ష్యం చేయడం ద్వారా వేలాది మంది ప్రతిభగల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారని అన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అంజలి, రఘురాం డిమాండ్ చేశారు.

చేపలు తినడం వల్ల అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు

- ప్రజలకు అవగాహన కోసం ఫ్లెక్సీ ఏర్పాటు


చేపలను అమ్ముతున్న మహిళ మత్స్య కార్మిక సంఘం సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
చేపలు తినడం వల్ల అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ప్రాథమిక మహిళ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షురాలు గాజనబోయిన స్వప్న అన్నారు. ఆదివారం మండలంలోని కోనా సముందర్ లో మృగశిర కార్తె సందర్భంగా మహిళా మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చేపల విక్రయాలను కొనసాగించారు. ఈ సందర్భంగా చేపలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. తరచుగా చేపలు తినడం వల్ల అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని పేర్కొన్నారు. చేపలు తినడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. చేపల నుండి శరీరానికి విటమిన్ డి పుష్కలంగా అందుతుందని, నిత్యం ఎదురయ్యే ఒత్తిడి, మానసిక ఆందోళనలు తగ్గుతాయని పేర్కొన్నారు. గర్భిణీలు చేపలు బాగా తినడం వల్ల కడుపులో బిడ్డ మెదడు బాగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. చేపల ఉండే ఒమేగా 3 ఫ్యాటి ఆసిడ్లు కీళ్ల నొప్పులను తగ్గించడానికి ఉపయోగపడతాయన్నారు. చేపలు తినడం వల్ల అనేక రకాల క్యాన్సర్ల నుండి తప్పించుకోవచ్చని అన్నారు. చేపలు దృష్టిని మెరుగుపరచడం తో పాటు నిద్ర సమస్యను దూరం చేస్తుందని వివరించారు. డయాబెటిస్ తో బాధపడే వారు చేపలు తింటే మంచిదన్నారు. చేపలు క్రమం తప్పకుండా ఆహారంతో తీసుకుంటే డయాబెటిస్, థైరాయిడ్, ఆర్థ్రైటిస్ వంటి అటో ఇన్సున్ వంటివి రాకుండా ఉండడంతో పాటు విద్యార్థులు చేపలు తినడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని ఫ్లెక్సీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కాగా మృగశిర కార్తె శనివారం రావడంతో మండలంలో ఆదివారం పెద్ద ఎత్తున చేపల విక్రయాలు కొనసాగాయి. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు గాజనబోయిన భాగ్య, కార్యదర్శి గాజనబోయిన సుకన్య, డైరెక్టర్లు ఎర్ర రేణుక, జి. గంగమణి, ఎర్రోళ్ల జ్యోతి, ఎర్రోళ్ల లత, యు.రుక్మిణి, జి. స్వప్న, వనిత, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మారుస్తానన్న మోడీ ప్రకటనను మానుకోవాలి

- రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి లక్ష్మణ్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్
రాజ్యాంగాన్ని మారుస్తాని మోడీ బీజేపీ చేస్తున్న ప్రకటన తక్షణమే మానుకోకపోతే దళితుల సహనన్ని పరీక్షించడమే అవుతుందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి లక్ష్మణ్ అన్నారు. పట్టణంలోని మిలన్ ఫంక్షన్ హల్‌లో ఆదివారం జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధికి మాత్రమే పాటుపడాలని, వీడిసిని అడ్డం పెట్టుకుని ఇష్టనుసారంగా కుల బహిష్కరణల పేరుతో ఆగడాలు మితిమీరుతున్నాయని అన్నారు. తక్షణమే వాటిని ప్రభుత్వాలు ఉక్కుపాదం తో అణచి వేయాలని అయన కోరారు.. ఈ సందర్భంగా డిహెచపిఎస్ జిల్లా నాయకులు కంజార భూమన్న, రాజన్న, మాదరి నరేష్ మాట్లాడుతూ.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై అనేకరకాలుగా దాడులకు తెగబడుతున్న బీజేపీ ని ఎదిరించాలంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ప్రజలు ఏకం కావాలని అన్నారు. రానున్న రోజుల్లో గ్రామ గ్రామాన డి హెచ్ పి ఎస్ సంఘాన్ని బలోపేతానికి కృషి చేస్తానని మాదరి నరేష్ అన్నారు. కార్యక్రమంలో.ముత్యాలు.లక్ష్మి నర్సయ్య.ముప్పారపు రాజా శేఖర్.సోమా శీను. ఆరెపల్లి సాయిలు.తదితరులు పాల్గొన్నారు.

డైట్ ప్రిన్సిపాల్‌ను విచారించాలి



మాట్లాడుతున్న పిడిఎస్‌యూ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
నిజామాబాద్ నగరంలోగల డైట్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్‌పైన విచారణ చేపట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యు)నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ.. నిజామాబాద్ డైట్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ చేసిన అక్రమాల మీద విచారణ చేపట్టాలని నెల రోజులు ముందే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విచారణను మోస్ట్ అర్జంట్ ఎంక్వయిరీ అని ఆర్జెడి వరంగల్ గారికి పంపిందని అన్నారు. నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ మీద ఎటువంటి విచారణ చేపట్టకపోవడం, ఆర్జెడి వరంగల్ పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. గతంలో విద్యార్థులను డైట్ కళాశాల ప్రిన్సిపల్ మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని, మతపరమైన భేదాలు చూపెడుతున్నారని జిల్లా కలెక్టర్లకు విన్నవించడం జరిగిందన్నారు. అదే తరుణంలో పిడిఎస్యు ఇతర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ముందు ఆందోళనలు, కళాశాలలో ధర్నాలు, వినతి పత్రాలు ఇవ్వడం, రాష్ట్ర ఉన్నత అధికారులకు కూడా విన్నవించడం జరిగిందన్నారు. దాని మూలంగా డైట్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ మీద విచారణకు రెండుకమిటీలు వేశారన్నారు. దాదాపు 34 సంవత్సరాలుగా ఇక్కడే తిష్ట వేసిన ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్‌ని మాత్రమే విచారణ చేయడం జరిగింది. కంప్లైంట్ ఎవరు ఇచ్చారో వారితోపాటు, విద్యార్థులను కూడా ఎటువంటి సమగ్ర విచారణ చేపట్టలేదన్నారు. ఇష్టం వచ్చిన విధంగా నిధుల దుర్వినియోగం జరిగిందన్నారు. డైట్ కళాశాలలోని ట్రైనీల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారికే అదనపు బాధ్యతలు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. డైట్ కళాశాలల్లో ఒకేషనల్ స్క్రాప్ సామాన్లు పై అధికారుల అనుమతి లేకుండా అమ్మడం జరిగిందన్నారు. కళాశాలలోని చాలా వరకు చెట్లను అటవీ శాఖ అధికారుల అనుమతి లేకుండా కొట్టి వేసి అమ్మడం జరిగిందన్నారు. ఈ విధంగా అనేక రకాలుగా విద్యార్థి ట్రైనీలను, సిబ్బందిని మానసికంగా వేధిస్తున్నారన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం డైట్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సేవలకు అవార్డులు

నవతెలంగాణ-ముప్కాల్
2023-24లో ముప్కాల్ లయన్స్ క్లబ్ ద్వారా మండల ప్రజలకు ఉత్తమ సేవలను అందించినందుకుగాను లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్, సెక్రటరీ కట్ట మహేష్, ట్రెజరర్ జక్కుల రాములు అవార్డులు అం దుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'జిల్లా లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్-320-డి ఆధ్వర్యంలో ఉత్తమ సేవా అవార్డులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ లో చేరడం, మా వంతు సేవ లను అందించడం చాలా గర్వంగా ఉందన్నారు. అవార్డు లు అందుకోవడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు.



క్షత్రియ సమాజ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆర్మూర్
క్షత్రియ సమాజ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బచ్చేవాల్ రెడ్డి ప్రకాష్, కార్యదర్శి బారడ్ గంగా మోహన్ ఆధ్వర్యంలో నూతన పంచ్ కమిటీ సభ్యులు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణంలోని లక్ష్మీనారాయణ మందిరంలో క్షత్రియ సమాజ్ నూతన అధ్యక్షుడిగా రెడ్డి ప్రకాష్ ఎన్నిక కావడంతో ఆదివారం కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సమాజ్ ఉపాధ్యక్షులుగా బాదాం రాజ్ కుమార్, హజారి సతీష్, సంయుక్త కార్యదర్శులుగా హజారి రమేష్, షికారి శ్రీనివాస్, సంతని విజయ్, భారడ్ కిషోర్‌ను ఎన్నికల అధికారి సాత్ పుతే తులసీదాస్, క్షత్రియ సమాజ్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి, మున్సిపల్ కోర్టు పిపి ఖాందేష్ శ్రీనివాస్, సలహాదారులు కర్తన్ హరి నారాయణ, అల్జాపూర్ లక్ష్మీనారాయణ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన సభ్యులుగా గట్టడి సత్యనారాయణ, అల్జాపూర్ హరికి ఆనంద్, జెస్సు శ్రీనివాస్, దొండి శ్రీనివాస్, వైద్య రవీందర్, మామిడి లక్ష్మీనారాయణ, చౌల్ రాజ్ కుమార్, సాత్ పుతే శ్రీనివాస్, బొబిడే గంగా కిషన్, కర్తన్ శ్రీనివాస్, పాన్ శ్రీనివాస్, దొండి శ్యామ్, జుగ్గే సుధీర్, నూతన్ శ్రీనివాస్, కర్తన్ దినేష్, ఘటడి రాజేష్, జీవి అరవింద్, ఘటడి గంగా మోహన్, పోహర్ గంగా మోహన్, కోడె శ్రీనివాస్, దొండి ఈశ్వర్, గట్టడి శ్రీనివాస్, కర్తన్ గంగా మోహన్, ఖాందేష్ సత్యం, అల్జాపూర్ వీరేంద్ర, దొండి సుఖేష్ వర్మ, సాత్ పుతే గణేష్ గౌరవ్, బారడ్ బాలాజీ రావు, ఖాందేష్ రాజేశ్వర్, ఎస్‌జి రాము, కర్తన్ నవీన్, గుజరాతి విద్యాసాగర్, జీవి గౌతం, జెస్సు వినోద్, సంతని అశోక్, విశ్వనాథ్ శ్రీను రాజేష్, యువజన సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు సాత్ పుతే సంతోష్, దుమాని నీరజ్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ నూతన కార్యవర్గ సభ్యులుగా ఎంపికై ప్రమాణస్వీకారం చేసిన సభ్యులు సమాజ్‌లో నిర్వహించే కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సమావేశాలకు రావాలన్నారు. సమాజ్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలలో భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు క్షత్రియ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గాన్ని సన్మానించిన పలువురు

మున్నూరు కాపు కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులుగా ముదాం స్వామి, ఉపాధ్యక్షులు నిమ్మల తిరుమలయ్య, గాడి రవీందర్, ప్రధాన కార్యదర్శి హరిరవి, కోశాధికారి గాడి నర్సింలు, సహాయ కార్యదర్శి కొమ్ము భాస్కర్, గాడి రమేష్, సహాయ కోశాధికారి మాసుల నర్సింలు, అతేల్లి తిరుమలేష్, సలహాదారులుగా హరి నర్సయ్య, కొమ్ము రమేష్, గాడి సుభాష్, గాడి లింగం, రాజయ్య, సురేష్, బాల్‌చంద్రం, నగేష్, నర్సింలు, పెద్దనర్సింలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 సంవత్సరంలో పదవ తరగతి చదువుతున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకొని తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పడకేసిన సమస్యలు

- చుట్టపు చూపుగా వచ్చిపోతున్న గ్రామ ప్రత్యేకాధికారులు
- సమస్యల పరిష్కారంలో విఫలమవుతున్న వైనం

నవతెలంగాణ-బోధన్

గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు పూర్తవడంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక అధికారుల పాలనను తెచ్చింది. దాంతో గ్రామంలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టవలసిన గ్రామ ప్రత్యేక అధికారులు తమకేమీ పట్టనట్లు చుట్టపు చుపుగా వచ్చి పోతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఒకవైపు వారు పనిచేసే కార్యాలయంలో పనుల వలన గ్రామ పంచాయతీలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటానికి సమయం కేటాయించలేకపోతున్నారు. దాంతో ఒకవైపు నిధులు లేక, మరోవైపు గ్రామ ప్రత్యేకాధికారులు గ్రామాల సమస్యలపై దృష్టి సారించలేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. బోధన్ మండలంలోని పలు గ్రామాలలో సమస్యలు తాండవిస్తున్నాయి. గ్రామపంచాయతీ పాలకవర్గం గడువు ముగిసిపోయి నెలలు గడుస్తుండడంతో ప్రభుత్వం ప్రత్యేక గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. అంత వరకు బాగానే ఉన్న గ్రామ ప్రత్యేక అధికారులు సమయానికి గ్రామానికి రాక గ్రామంలోని సమస్యలు పట్టించుకోకపోవడంతో ఎక్కడి సమస్యలు



పేరుకుపోయిన చెత్త చెదారం



అక్కడే ఉన్నాయి. దాంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చెప్పుకుందాం అంటే ప్రత్యేక అధికారులు సమయానికి ఉండడం లేదని, గ్రామపంచాయతీ కార్యదర్శులు నిధులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

బోధన్ మండలానికి మారుమూల గ్రామమైన బిక్నెల్లి, కొప్పర్గా గ్రామంలో సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నాయి. బిక్నెల్లి గ్రామంలో గత రెండు రోజులుగా విద్యుత్ దీపాలు రాక కరెంటు సరఫరా లేక చీకటిలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. దాంతో తాగునీరు సైతం లభించక తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తుల పేర్కొన్నారు. అలాగే కొప్పర్గ గ్రామంలో నిధులు లేక పారిశుధ్యం ఇబ్బందిగా మారింది. పేరుకే గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు కానీ గ్రామంలోని సమస్యలను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. కావున అధికారులు తక్షణమే స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ

నవతెలంగాణ-పిట్లం/జుక్కల్

నకిలీ విత్తనాలు విక్రయించే ఫర్టిలైజర్ షాప్‌ల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశా రు. జుక్కల్ నియోజకవర్గంలోని పలు మండలాల ఫర్టిలై జర్ షాప్ యజమానులు నకిలీ విత్తనాలు, లూజు విత్తనా లు అమ్మిన విత్తనాల వ్యాపార దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విత్తనాలు విక్రయించే రైతులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు నమోదు చేసుకొని, విత్తనాల కొనుగోలు అనంతరం ఒరిజినల్ రిసిప్ట్ పొందాలని సూచించారు. ఒరిజినల్ రిసిప్ట్ లేని షాపుల్లో విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని రైతులను కోరారు.

మాజీ సైనిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ



నవతెలంగాణ-బోధన్

మాజీ సైనికుల అసోసియేషన్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షులుగా బోధన్ మండలం ఎరాజ్‌పల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న బాలకృష్ణ ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సైనిక భవన్‌లో నిర్వహించిన మాజీ సైనికుల సమావేశంలో జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలలో ఆయనకు జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మాజీ సైనికుల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సహచర గ్రామపంచాయతీ కార్యదర్శులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్ఎంపీ మృతి.. పలువురి సంతాపం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం హున్సా గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ గణపతి(40) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న బోధన్ ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు హున్స గ్రామానికి చేరుకుని ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు వారి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనారోగ్యంతో మృతిచెందిన ఆర్ఎంపీ వైద్యుడు గణపతి సేవలను మరువలేమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు యాదాచారి, కారం స్వామి, సభ్యులు హన్మండ్లు, కిషన్, ఫయాజ్, శ్రీనివాస్, యాదవరావు, రియాజ్ తదితరులు ఉన్నారు.

11న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 11న మంగళవారం ఉదయం 11 గంటలకు ఎల్లారెడ్డి మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎల్లారెడ్డి ఎంపీడీవో లక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీపీ మాధవి బాలరాజ్ గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీటిసి సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపిటిసిలు, మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ ప్రత్యేక అధికారులు, మండల స్థాయి, డివిజన్ స్థాయి అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచార ప్రగతి నివేదికతో హాజరై మండల సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గపూర్ శిక్షక్‌ను అభినందించిన డీఈవో



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విద్యాశాఖాధికారి రాజు

నవతెలంగాణ-కామారెడ్డి

హిందీ ఉపాధ్యాయులైన గపూర్ శిక్షక్ తెలుగు భాషలో రచనలను చేస్తూ కవిగా రాణిస్తున్నారని, మంచి రచనలను సమాజానికి అందిస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అభినందించారు. ఈ సందర్భంగా ఇటీవల గపూర్ శిక్షక్ ఆవిష్కరించిన యుద్ధ గీతం దీర్ఘ కవిత పుస్తకాన్ని విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు గపూర్ శిక్షక్ చేస్తున్న సాహిత్య సేవలను కొనియాడారు. యుద్ధ గీతం దీర్ఘ కవిత పుస్తకాన్ని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు దామోదర్‌రెడ్డి, కుషాల్, అనిల్ నార్ల, అరుణ్ కుమార్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల ఊబిలోకి మాజీ సర్పంచ్‌లు

- బిల్లులు రాక అనేక అవస్థలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ప్రజలకు సేవ చేయాలనే ఆకాంక్షతో ఎన్నికల్లో పోటీచేసి సర్పంచ్‌గా గెలిచిన కొందరు అప్పుల ఊబిలోకి జారుకున్నారు. సర్పంచుల పదవీకాలం ముగియటంతో మళ్లీ కొత్త సర్పంచులకు ఎన్నికలు సమీపిస్తున్న విషయం తెలిసిందే. అయితే గత సర్పంచ్‌లు అప్పుల ఊబిలోకి కూరుకుపోయారనేది వాస్తవం. గత సర్పంచులు తమ పదవీ కాలంలో కష్టపడి ప్రజాప్రతినిధుల అధికారుల ఆదేశానుసారం అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేశారు. నేటి వరకు బిల్లులు రాకపోవడంతో కొంతమంది సర్పంచులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

పెద్దకొడప్‌గల్ మండల పరిధిలోని 25 గ్రామపంచాయతీలలో కేవలం కొన్ని గ్రామపంచాయతీలకు మాత్రమే నిధులు వస్తున్నాయి. పరిశ్రమల నుంచి టాక్స్‌లు మిగతా గ్రామపంచాయతీలకు సోర్స్ లేకపోవడంతో ఆ సర్పంచులు చేసిన పనులు బిల్లులు రికార్డులు చేయడంతో తీరా ప్రభుత్వం చెక్కులను రిజెక్ట్ చేయటంతో మాజీ సర్పంచులు అయోమయంలో పడ్డారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు ఇలా ఎన్నికల కోడ్‌లు రావడంతో చెక్కులు, చెల్లుబాటు కాకపోవటంతో మాజీ



సర్పంచులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఏదైనా సమస్య అడగాలంటే గ్రామ కార్యదర్శిని సంప్రదించాల్సి వస్తుంది. గ్రామ కార్యదర్శి తాగునీరు, విద్యుత్ దీపాలు తప్ప ఇరత పనులేవీ చేయలేకపోతున్నారు. గ్రామాలలో చిన్నచిన్న తగాదాలు జరుగుతున్నప్పటికీ ఎవరికి వారే యమునా తీరే అంటూ మాజీ సర్పంచులే పంచాయతీల తీర్పు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా గత ప్రభుత్వం పాత సర్పంచులకు 10 సంవత్సరాలు రిజర్వేషన్ ఖరారు చేసింది. ఈ ప్రభుత్వం ఆ రిజర్వేషన్‌ను మారుస్తుందా యథావిధిగా కొనసాగుతుందా అర్థం కాని పరిస్థితిలో సర్పంచులు చర్చించుకుంటున్నారు. ఈ ప్రభుత్వం ప్రస్తుతం టీజీగా మార్చడంతో అలా రిజర్వేషన్ కూడా మారుస్తారా అనే సంక్షిప్తంలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వార్డు సభ్యులు చర్చిస్తున్నారు.

రామోజీరావుకు నివాళి



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు శనివారం అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో రెంజర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామోజీరావు పత్రికా రంగంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. పత్రికా రంగంలో కొత్త పుంతలు తొక్కించి తనదైన ముద్ర వేసిన అక్షర యోధుడని వారు కొనియాడారు. నిబద్ధతతో కూడిన జర్నలిజాన్ని ఐదు దశాబ్దాలుగా కొనసాగించడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.నాగరెడ్డి, బి.శ్రీనివాస్, ఎస్.గంగాధర్, కిరణ్, నాగరాజ్, జలీల్‌బేగ్, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో బాలాజీ మందిర 19వ వార్షిత్సవ వేడుకలను ఆదివారం, సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రజలకు తెలియజేశారు. అందులో భాగంగా ఆదివారం కుంకుమార్చన నిర్వహించారు. సోమవారం అన్నదానంతో కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు. ఈ ఉత్సవాలలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

బడిబాటలో ప్రభుత్వ పాఠశాలలపై ఇంటింటికి ప్రచారం



బడిబాట ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-బోధన్

బడిబాట కార్యక్రమంలో భాగంగా బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ) ఉపాధ్యాయులు ఆదివారం బడిబాట కార్యక్రమంలో భాగంగా రాకాసిపేటలోని గాంధీనగర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాలపై అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రాచప్ప మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలో కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చేరి చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, ఉచితంగా దుస్తులు, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు అందించనున్నట్లు వివరించారు. అలాగే విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం మంజూరు చేయనున్నట్లు సూచించారు. కావున విద్యార్థులు ఈ బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలో చేరి ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు వసీం సుల్తానా ఉన్నారు.

మాజీ సైనికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

నవతెలంగాణ-బోధన్

దేశ రక్షణ కోసం పనిచేసిన మాజీ సైనికుల సమస్యలను ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని మాజీ సైనికుల అసోసియేషన్ అధ్యక్షులు హరప్పా డిమాండ్ చేశారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సైనిక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకొని వారు మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు హరప్పా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా మాజీ సైనికులకు క్యాంటిన్, స్టోర్ డిపార్మెంట్ మీద పన్నులు వేసిందని దానిని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం ద్వారా తమకు రావాల్సిన ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ అందించాలని కోరారు. తమకు ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త ప్రభుత్వం అయినా దేశ రక్షణ కోసం పనిచేసిన సైనికులను గౌరవిస్తూ గత ప్రభుత్వాల హయాంలో మాజీ సైనికులకు ఎలాంటి గౌరవం దక్కిందో అలాంటి గౌరవం, సంక్షేమం అందేలా చేయాలన్నారు. అనంతరం మాజీ సైనికుల



మాట్లాడుతున్న నూతన కమిటీ నాయకులు

అసోసయేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా హరప్పా, ప్రధాన కార్యదర్శిగా రవికాంత్, ట్రెజరర్ థామస్ జ్యోతిరాజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రూపేష్, ఉపాధ్యక్షులుగా మధుసూధన్, బాలకృష్ణ(ఎరాజ్‌పల్లి జీపీ కార్యదర్శి), మహిళ ప్రతినిధిగా సుజాతను ఎన్నుకున్నారు. మాజీ సైనికుల, వీరనారిల సంక్షేమం కోసం శాయశక్తులా ప్రయత్నం చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

అనుమతి లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

- బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజ్

నవతెలంగాణ-కామారెడ్డి

అనుమతి లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బీసీ విద్యార్థి సంఘం సమావేశంలో నాగరాజ్ మాట్లాడుతూ.. జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చాలా పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకుండా నడుపుతున్నారని, అలాగే ఒక భవనం నుంచి మరో భవనంలోకి మార్చిన విషయంలో నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారం ఫీజులు పెంచేసి, విద్యాసంస్థల్లోనే పుస్తకాలు, దుస్తులు లాంటివి అధిక ధరలకు విక్రయిస్తూ అధిక మొత్తంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు దండుకుంటున్నారని అన్నారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయకుండా ఇష్టానుసారంగా నడుపుతున్న



మాట్లాడుతున్న నాయకులు

పాఠశాలలపై డీఈఓ చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి డీఈవో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్, సంతోష్, పెద్దోళ్ల మహేష్, నరేష్, రాజేందర్, స్వామి, ప్రభంజన్, కిరణ్, రమేష్, శ్రీధర్, మోహన్, రాము, కృష్ణ, సచిన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వే బిల్లులు లేని ఇసుక లారీలను పట్టుకున్న బిచ్కుంద ఎస్సై



అదుపులోకి తీసుకున్న ఇసుక లారీలు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని గుండెనెమిలి ఇసుక క్వారీ నుంచి వే బిల్లులు లేకుండా వెళ్తున్న ఏడు ఇసుక లారీలను బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ తనిఖీలు చేపడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న కొందరు లారీ డ్రైవర్లు లారీలను రోడ్డుపైన ఆపి పారిపోయారు. దీంతో ప్రైవేట్ డ్రైవర్లను ఏర్పాటు చేసుకొని లారీలను బిచ్కుంద పోలీస్ స్టేషన్‌కు లారీలను తరలించారు. శని, ఆదివారాలలో ఇసుక లారీలలో ట్రాక్టర్ల ద్వారా రాత్రి, పగలు తేడా లేకుండా ప్రభుత్వ అనుమతి లేకుండానే ఇసుకను తరలిస్తున్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
సోమవారం | జూన్ 10, 2024 | www.navatelangana.com

ఎక్స్ ఆర్మీ సర్వీస్‌మెన్ అసోసియేషన్ సమావేశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని శిశుమందిర్ హైస్కూల్‌లో ఆదివారం ఎక్స్ ఆర్మీ సర్వీస్‌మెన్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు శివ కుమార్ నాయర్ మాట్లాడుతూ ఇటీవల రిటైర్డ్ అయిన ముగ్గురు జవాన్లు అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకోవడం జరిగిందన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తమ అసోసియేషన్‌కు జులై మాసంలోగా స్థలం కెటాయిస్తామని హామీ ఇచ్చారని, స్వాతంత్ర్య దినోత్సవం రోజు తమ స్థలంలోనే జాతీయ జెండాను ఎగురవేస్తామని అన్నారు. అలాగే త్వరలో కుమురం భీం జిల్లాలో ఎన్‌సీసీ కోచింగ్ సెంటర్ ప్రారంభం అవుతుందన్నారు. కలెక్టరేట్‌లో ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ప్రత్యేక ఆఫీస్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా బీర్సా ముండా వర్ధంతి

నవతెలంగాణ-కెరమెరి

భారతదేశ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆదివాసీ ఉద్యమ వీరుడు క్రాంతిసూర్యవీర్ భగవాన్ బీర్సా ముండా 124 వ వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీర్సా ముండా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ బీర్సా ముండా సేవలను కొనియాడారు. గిరిజనులు ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోని హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు కుడ్మేత సోము, సెడ్మకి తుకారాం, షేకు, ఆత్రం విశ్వేశ్వర్, కోట్నక బాపురావు, భీంరావు పాల్గొన్నారు.

అల్లనేరుడు.. ఆరోగ్యానికి మేలు

- షుగర్ వ్యాధిగ్రస్తులకు సంజీవని
- వర్షాకాలంలో లభించే పండు ఇది



నవతెలంగాణ-ఆర్మూర్

సంపూర్ణ ఆరోగ్యం కోసం సీజనల్‌గా దొరికే ప్రతి పండు ఒక ఔషధమే అని పెద్దలు చెబుతుంటారు. వర్షాకాలంలో విరివిరిగా లభించే పండ్లలో నేరేడు పండ్లు ముఖ్యమైనవి. తీపి ,వగరు ,పులుపు రుచులతో ఉండే అల్లనేరేడు ను ఆయుర్వేదంలో పోషకాల గని అంటారు. అల్లనేరేడు మధుమోహగ్రస్తులకు సంజీవనిగా వైద్యులు చెబుతారు. ఒక పండే కాదు అల్లనేరేడు ఆకులు, బెరడు ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఆక్సలిక్, టాన్నిన్ ఆమ్లం విటమిన్లు ,క్రోమియం వంటివి నేరేడు పండులో పుష్కలంగా లభిస్తాయి. కిలో అల్ల నేరేడు పండ్లు రూ.200 విక్రయిస్తున్నారు. నాందేడ్, ధర్మాబాద్, హైదరాబాద్, వరంగల్ నుంచి దిగుమతి చేసుకొని పట్టణంలో అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ప్రజలు కొనడానికి ఆసక్తి కనపరుస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు.

ఆరోగ్యానికి మంచిది...

ప్రతి 100 గ్రాముల అల్లనేరేడులో ప్రోటీన్లు 0.7 శాతం, కొవ్వులు0.3 శాతం, ఖనిజాలు 0.04, పిండి పదార్థాలు15 మిల్లీ గ్రాములు, ఫాస్ఫరస్ 15, ఐరన్1.2, విటమిన్ సి18 మిల్లి గ్రాములుగా లభిస్తాయి.



ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

అల్లనేరేడు పండ్లు పిల్లలు పెద్దలు ఇష్టంగా తింటారు. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పిల్లలకు పంటి, గొంతు సమస్యలు రాకుండా నివారిస్తాయి. మధుమేహగ్రస్తులకు చాలా మంచిది. బిపి లెవల్స్‌ను కంట్రోల్ చేస్తుంది.

డాక్టర్ వెంకట్ గౌడ్- రిషిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్-ఆర్మూర్.

విచ్చలవిడిగా ఇసుక అక్రమ నిల్వలు

- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న సంబంధిత అధికారులు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా అక్రమ ఇసుక నిలువలు చేస్తున్నారు. సిమెంట్ బ్రిక్స్ కేంద్రాల్లో ఇసుక డంపులు ఉన్నా అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. రోజు రోజుకు వాగుల్లో భూగర్భ జలాలు అంతరిస్తున్న తరుణంలో మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న వాగులు, వంకల నుండి ఇసుకను తీస్తుండడంతో ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గత మూడు నెలల క్రితం వరకు సమీప వాగుల నుండి కాని, గోదావరి నుండి కాని ఇసుక తీసుకురావలంటే కష్టంగా ఉండేది, అధికారుల కండ్లు కప్పి వారి కదలికలను గమనిస్తూ ఇసుకను తరలిం చే వారు ప్రస్తుత పరిస్థితుల్లో ఇసుక రవాణా దారులకు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. మండల కేంద్రం నుంచి ఇంధన్‌పల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారి ఇరు వైపులా సిమెంట్ బ్రిక్స్ విచ్చలవిడిగా కనిపిస్తాయి. ఇందులో ఇసుక కుప్పలను చూస్తుంటే కళ్లు జిగెల్లుమనే విధంగా ఇసుక డంపులు కనిపిస్తున్నాయి. మళ్లీ ఆ ఇసుకతో పగలంతా సిమెంటు ఇటుకలు తయారు చేస్తారు. సాయంత్రం వరకు కొంత మట్టుకే అక్కడ ఇసుక కనిపిస్తుంది. మళ్లీ తెల్లవారుజాము నుండి వాగులు, గోదావరి నదుల్లోనుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను సిమెంట్ బ్రిక్స్ కేంద్రాలకు తరలిస్తుంటారు. ఈ వ్యవహారం అంతా ప్రతి రోజు జరుగుతోంది. ఈ ప్రాంతమే కాకుండా కలమడుగు సమీపంలో గల గోదావరి నుంచి ఇసుకను ఇతర ప్రాంతలకు తరలిస్తు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. గోదావరి నుంచి గ్రామంలోకి ఇసుక రావాలంటే గ్రామ సమీ పంలోనే అటవీ శాఖ ఏర్పాటు చేసిన చెక్ పోస్టును దాటి రావల్సిందే కాని అక్కడ ఉన్న సిబ్బంది ఇసుక ట్రాక్టర్లను ఆపకపోవడాన్ని బట్టి చూస్తే అధికారులు ఏమి చేస్తున్నారో అర్థం అవుతుంది. కలమడుగు గోదావరి నుంచి రేవోజీపేట, చెన్నూరు, బుట్టాపూర్, తదితర గ్రామాలకు సైతం విచ్చలవిడిగా ఇసుకను తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.

గ్రామ శివారుల్లో భారీ డంపులు

బాదంపెల్లి గోదావరిలో సైతం ప్రతీ రోజు ఇసుకను తీస్తూ ఆ గ్రామ శివారులో అక్రమ నిలువలు చేసుకొని అధిక మొత్తంలో మండల కేంద్రానికి తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు కాని టైగర్ జోన్‌లో ఎలాంటి నిక్షేపాలు తీయరాదని చెప్పే అటవీ అధికారులు ఏంచేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంటి నిర్మాణాలకు తెచ్చుకునే ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని రూ.వేలల్లో జరిమానాలు విధిస్తున్నా అటవీ అధికారులు సిమెంట్ బ్రికుక్సు తరలించే ఇసుక ట్రాక్టర్లను పట్టుకోకపోవడం ఏటని పలువురు మిమర్శిస్తున్నారు. మండలంలోని చింతలపల్లి, తిమ్మాపూర్, తపాలాపూర్, ధర్మారం, కన్నాల్, ఇంధన్‌పల్లి, తదితర గ్రామాల సమీపంలో ఉన్న వాగులు, గోదావరి లోనుంచి ఈ ఇసుక దందా యదేచ్ఛగా కొనసాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణను అరికట్టాలని కోరుతున్నారు.

బాధితులకు బాసటగా తేలికుల సంఘం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని బాబాపూర్ గ్రామంలో తమ కులస్తునికి చెందిన ఇండ్లు దగ్ధమై పెద్ద ఎత్తున నష్టం జరిగింది. విషయం తెలియడంతో తేలి కుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సందీప్ ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు. విరాళాలను ఆదివారం బాదిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ బాధితులకు సాయం చేసేందుకు కులస్తుల వద్ద నుండి సేకరించిన రూ.15,768 నగదుతో పాటు 50కిలోల బియ్యం, 5లీటర్ల వంట నూనె, సామాగ్రి ఇచ్చి బాధితులను పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం యువజన అధ్యక్షులు హిద్రే సందీప్, సెండే మురళీ కృష్ణ, కవాల్కర్ ఆనంద్ రావు, కవాల్కార్ ఉద్ధవ్, తపసే పోచన్న, మేంగ్రే మారుతి, కవల్కార్ రవీందర్, కవాల్కార్ ఆకాశ్, బీజ్జు పాల్గొన్నారు.

ఏండ్ల తరబడి ఒకే చోట తిష్ట

డిప్యూటేషన్‌పై ఒకే స్థానంలో ఉద్యోగులు.. ఇకనైనా బదిలీ అయ్యేనా?



నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వ అధికారులు రెండు, మూడు సంవత్సరాలకు ఒకసారి బదిలీ కావడం సర్వసాధారణం. అడ్మినిస్ట్రేషన్‌తో పాటు ప్రభుత్వ పథకాలను అమలు చేసే విషయంలో ఎలాంటి పక్షపాత ధోరణి ప్రదర్శించకుండా ఉండేందుకుగాను బదిలీలు చేయడం అనేది తప్పనిసరి.. ఆనవాయితీ కూడా..

అన్ని శాఖలలో ప్రక్షాళన జరిగేనా..

పలు శాఖలలో క్షేత్రస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు చాలామంది అధికారులు ఏళ్లుగా తిష్ట వేశారు. గత ప్రభుత్వంలో కొంతమంది అధికారులు జిల్లాల్లో పోస్టింగ్ పొంది ఏళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నారు. ప్రభుత్వం మారడంతో ప్రస్తుత అధికార పార్టీ తమకు అనుకూలమైన అధికారులను జిల్లాకు బదిలీ చేయించుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బదిలీలు ఇతరత్రా పనుల నిమిత్తం అధికారులు ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలను కలిసి తమ బదిలీల పనులను చేయించుకునేవారు. అలా బదిలీపై వచ్చిన అధికారులలో చాలామంది అధికారులు అప్పటి అధికార నాయకుల ఆదేశానుసారం నడుచుకున్నారని అపవాదును మూట గట్టుకున్నారు. దీంతో ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు తమ నియోజకవర్గాల పరిధితో పాటు జిల్లా స్థాయిలో భారీగానే బదిలీలకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కొందరు జిల్లా, మండల స్థాయి అధికారులు తాము ఉన్న సీట్లను వదిలేది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కొందరు కీలక అధికారులు పదేళ్లకు పైగా ఒకే చోట పని చేస్తుండడం గమనార్హం. క్షేత్రస్థాయి పర్యటనలో పేరుతో తప్పుడు సమాచారం ఇస్తూ పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

డిప్యూటేషన్ ముగిసిన...

గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు బదిలీలు జరిగిన ఒకే చోట తిష్ట వేసిన వారిపై సర్కారు ఇప్పుడు దృష్టి సారించింది. కొత్త జిల్లాల విభజన సమయంలోను ఆర్డర్ టు సర్వ్ కింద సర్దుబాట్లు జరిగిన కొందరు ఒకేచోట ఉండి పోయారని గుర్తించింది. గత ఎన్నికల్లో రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, మరికొన్ని డిపార్మెంట్ల యందు బదిలీలు జరిగాయి. మరి కొంతమంది ఉద్యోగులు డిప్యూటేషన్‌పై ఏళ్లుగా ఒకే స్థానంలో కొనసాగు తున్నారు. ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారికి అనుకూలంగా ఉన్న వారిని డిప్యూటేషన్ ముగిసిన అదే స్థానంలో కొనసాగిస్తుండడం గమనార్హం.

జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో...

జిల్లాలోని ఆర్మూర్ డివిజన్ కేంద్రంగా పంచాయతీరాజ్, డిఎల్‌పిఓ, ఆర్‌డీఓ, అగ్నిమాపక, సబ్ రిజిస్టర్ తదితర కార్యాలయాలు ఉన్నాయి. వీటితో పాటు ఇతరత్రా శాఖలపై క్షేత్రస్థాయిలో ప్రభుత్వం దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. బాల్కొండ నియోజకవర్గంలో సైతం విద్య, వ్యవసాయ శాఖల్లో ఏళ్ల తరబడి అధికారులు ఒకేచోట ఉండడం కొసమెరుపు.

ఇష్టంతో చదివితే ఏదైనా సాధించవచ్చు

- విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ చెవుల రాజేశ్వర్



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఇష్టంతో చదివితే దేనినైనా సాధించవచ్చని విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ చెవుల రాజేశ్వర్ అన్నారు. జిల్లా దేవాంగ విద్యా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పెర్కిట్ ఎమ్మార్ గార్డెన్ పెరికిట్ నందు పదవ తరగతి ప్రతిభా పురస్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా దేవాంగ విద్యా కమిటీ సభ్యులు గోపాల వినాయక్ పసుపుల రఘునాథ్ కామిని చంద్రమోహన్ బోనికే రాము పసుపుల సుదర్శన్ కొంగి రాము సూర్య కొంగి మోహన్, ఏసిటిఓ లిక్కి భూమేశ్వర్, కౌన్సిలర్ లిక్కి శంకర్, ఆర్మూర్ మాజీ సర్పంచ్ కొంగి సదాశివ, జిల్లా దేవాంగ సంక్షేమ అధ్యక్షులు దుగ్గి లక్ష్మణ్, గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. జిల్లాలోని దేవాంగ పదో తరగతిలో జిల్లాస్థాయిలో ప్రథమంగా నిలిచిన ముగ్గురు విద్యార్థులు, ద్వితీయ స్థానంలో నిలిచిన ద్వితీయ స్థానంలో నిలిచిన నలుగురు, తృతీయ స్థానంలో నిలిచిన 8 మంది, గ్రామస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన 25 మంది, ద్వితీయ స్థానంలో నిలిచిన 15 మంది విద్యార్థులకు మెమొంటో లతో సత్కరించారు. చదువులో ముందున్న ఆర్థికంగా వెనుకబడిన 15 మంది విద్యార్థిని విద్యార్థుల చాలా ఫౌండేషన్ ఇతర దేవాంగ వ్యక్తుల ద్వారా ఒక్కొక్కరికి 5000 రూపాయల పారితోషకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ క్రమశిక్షణతో సమయపాలనతో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాలోని దేవాంగ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో
మహతి ఆశ్రమానికి విరాళం

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో అధ్యక్షులు పట్వారి గోపికృష్ణ అధ్యక్షతన బాల్కొండలో మహతీ ఆశ్రమంలోని నిరాశ్రయ విద్యార్థులకు శ్రీనివాస్ పవార్ స్పాన్సర్‌గా వ్యవహరించి నోట్ బుక్స్ స్టేషనరీ వస్తువులు పండ్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్వారి గోపికృష్ణ మాట్లాడుతూ ఇలాంటి ఆశ్రమాల్లో చదువుతున్న విద్యార్థులకు మా రోటరీ తరపున ఎల్లప్పుడూ సేవలో ముందు ఉంటామని అన్నారు. స్పాన్సర్ గా వ్యవహరించిన శ్రీనివాస్ పవార్‌కి దన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికా లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షులు ప్రవీణ్ పవార్, చౌటి లింబాద్రి, ఆశ్రమ యాజమాన్యలు నిర్మల ,నరేష్ ,స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏర్గట్లలో తైబజార్ వేలం

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన తైబజార్ వేలం, పశువుల సంత వేలం ఈనెల 10న సోమవారం ఉదయం 10 గంటలకు గ్రామపంచాయతీలో నిర్వహించడం జరుగుతుందని పంచాయితీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు పదివేల రూపాయల డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని అన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆర్మూర్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-విలేకరులు

ఆర్మూర్: మండలంలోని అంకాపూర్ ఉన్నత పాఠశాల2008-09 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు వింజామర వెంకట నర్సయ్య, పసుపుల సుదర్శన్, గడ్డం భూమేశ్వర్,దొండి శ్యామల, శారదా, శామీమ్, అతిక్ ను ఘనంగా సన్మానించారు. విద్యార్థులంతా ఒకచోట చేరి నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సౌజన్య కవిత, వరలక్ష్మి, సౌమ్య, షఫీతదితరులు పాల్గొన్నారు.

ఫత్తేపూర్‌లో పూర్వ విద్యార్థుల రజతోత్సవ వేడుకలు

మండలంలోని ఫత్తేపూర్ గ్రామంలో ఎస్ఎస్సీ 1998-99 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం రజితోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాస్మేట్స్ పాఠశాల తరగతి గదుల్లో కలియ తిరుగుతూ అప్పటి జ్ఞాపకాలని నెమరు వేసుకున్నారు. వివిధ రంగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకే చోటుకు రావపైకి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గురువుల ముందు ఒకరినొకరు పరిచయం చేసుకొని, ఈ అపూర్వ కలయిక సందర్భంగా గురువు గొప్పతనానికి సంబంధించిన పాట రూపంలో కరపత్రాన్ని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా సమాజాన్ని మేల్కొలుపుతూ ప్లాస్టిక్ పెనుభూతం క్యారీ బ్యాగులు వద్దు... బట్ట సంచులే ముద్దు అనే కరపత్రాలను గురువుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. పర్యావరణాన్ని కాపాడడానికి వచ్చే వర్షాకాలంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని గురువుల సమక్షంలో ప్రతిన పూనారు.ఈ కార్యక్రమానికి హాజరైన గురువులు మల్కన్న, శ్రీరాములు గౌడ్,దూలూరి నర్సయ్య, అంబరీష్,నూకల శ్రీహరి, బక్కురి రాజేశ్వర్, పెనుగొండ సంతోష్, మైలారం రాజేశ్వర్ పాల్గొని వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల ఐక్యతను ఇలాగే కొనసాగించాలని హితవు పలికారు. పర్యావరణ పరిరక్షణకై పూర్వ విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించారు. చివరగా విద్యార్థులు గురువులను శాలువలు, పూలమాల, జ్ఞాపకలతో సన్మానించి ఆశీస్సులు పొందారు. సమన్వయకర్తగా జింధం నరహరి వ్యవహరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కిరణ్ గౌడ్, డాక్టర్ నాగరాజు, నరేష్, నవీన్, రవీందర్, ఎర్రన్న, సంకేత్ రెడ్డి, రాములు, రాజశ్రీ, గంగసాయవ్వ, త్రివేణి, సుజాత, శ్వేత, సరోజ రాజశ్రీ, సంధ్యారాణి, లక్ష్మీ వినోద, జ్యోతి, గంగామణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్: పట్టణంలో విజయ్ పబ్లిక్ స్కూల్ 1997-98 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 26 సంవత్సరాల తర్వాత తమ తోటి మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నామని చెప్పారు. గురువుల ద్వారా విద్యాబుద్దులు నేర్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకున్నామన్నారు. గురువు స్థానం గొప్పదని గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత్రి డాక్టర్ అమృతలత, ప్రిన్సిపాల్ కవిత దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్ జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2004-05 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం' సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ సంతోషసాగరంలో మునిగిపోయారు. నాడు పాఠాలు బోధించిన గురువులను సన్మానించుకున్నారు. గురువులు సైతం విద్యార్థులకు పలు సందేశాత్మక విషయాలను తెలిపారు.



ఆర్మూర్: విజయ్ పబ్లిక్ స్కూల్లో...



ముప్కాల్లో...

రైతు భరోసాకు ఎదురు చూపులు



నవతెలంగాణ-సదాశివనగర్
మండలంలోని రైతులు రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్నారు. రైతులు మృగశిర కార్తె పూర్తవడంతో పలు గ్రామాల్లో ఖరీఫ్ పంటలు వేసేందుకు గానూ సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందించే పంట పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. రైతులు పంట పెట్టుబడి కోసం ప్రైవేటు ఫైనాన్స్‌ల వద్ద వడ్డీకి అప్పు తెచ్చుకుంటున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతు భరోసాను అందించాలని కోరుతున్నారు.

గ్రామ దేవతలకు బోనాలు

నవతెలంగాణ-లింగంపేట్
మండలం ఆయా గ్రామాలలో ఆదివారం గ్రామ దేవతలకు గ్రామస్తులు బోనాలను తీశారు. మండలంలోని పర్మల్ల, సజ్జనపల్లి, కోమటిపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన ఆయా కులాలకు చెందిన కులస్తులు గ్రామ దేవతలకు ఇంటింటికి బోనాలను తీశారు. ఈ సందర్భంగా బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.


బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

పంట పొలాల్లో మద్యం సీసాలు

- మద్యం సేవించి అక్కడే పడేస్తున్న వైనం
- రైతులకు ఇబ్బందులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
ఎల్లారెడ్డి పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లోని పంట పొలాల్లో ఆకతాయిలు మద్యం సేవిస్తూ.. అక్కడే ఆ సీసాలను పగులగొడుతున్నారు. దీంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతులకు ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతుండగా.. మరోవైపు సాగుచేసిన పంటకు సరైన ధర లభించక నష్టపోతున్నాడు. దీనికి తోడూ కొందరు ఆకతాయిలు పంట పొలాల్లో మద్యం సేవించి అక్కడే సీసాలు పగులగొడుతుండటంతో రైతులు పంటను సాగుచేసే సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రైతులకు రబీ పంట కాలం పూర్తయి పంట చేతి కందగానే రైతులు ఓ రెండు మాసాలు పంట పొలాలకు వెళ్లకుండా సెలవిచ్చి కాస్త సేద తీరుతారు. ఆ సమయంలో పంట పొలాలన్నీ ఖాళీగా ఉంటాయి. అదే అదునుగా భావించి మద్యం ప్రియులు వేసవికాలంలో ప్రశాంతమైన వాతావరణం చల్లటి గాలిలో ఆరు బయట సిట్టింగ్ అంటూ నాలుగురు ఐదుగురు తోడై గుంపులు గుంపులుగా మిత్రులతో కలిసి ఊరు బయట పంట పొలాల్లో కూర్చుని మద్యం సేవించడం ఎక్కువవుతోంది. పొలాలు ఖాళీగా ఉండడంతో వేసవి కాలమంతా ఈ విధానం యథేచ్ఛగా సాగుతుంది. పొలాల్లో ఎక్కడ చూసినా మద్యం సీసాలే దర్శనమిస్తున్నాయి. తాగిన మైకంలో కొంతమంది తాగుబోతులు విచక్షణ జ్ఞానం లేకుండా మద్యం సీసాలను పగలగొట్టడంతో పదునైన సీసముక్కలు పొలాల్లో విచ్చలవిడిగా పడి ఉంటాయి. జూన్ నెల ప్రారంభమై వర్షాకాలం మొదలై వర్షాలు పడగానే పగిలిన మద్యం సీసా ముక్కలు పొలమంత వ్యాపిస్తాయి. అప్పుడే పొలం పనుల్లో నిమగ్నమైన రైతులకు మద్యం సీసా పచ్చులు ఏరివేయడం సవాలుగా మారుతోంది. విచ్చలవిడిగా బెల్టు షాపులు పెరగడంతో మద్యం అమ్మకాల్లో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ఏమోగానీ రైతులకు జరిగే నష్టం తీవ్రంగా ఉంటుంది. మట్టిలో బురదలో చెల్లాచెదురైన సీసా ముక్కలు పనుల్లో నిమగ్నమైన రైతుల కాళ్లు చేతులకు గుచ్చుకొని ప్రమాదాలకు గురవుతున్నారు. ఆచీతూచీ అడుగేసే మనుషులకే ఇంత ప్రమాదకరమైతే ఆ పదునైన సీసా పచ్చులు నాగలితో దుక్కు దున్నే పశువులకు కాడెద్దులకు ఎంత ప్రమాదం పొంచి ఉందో అర్థమవుతోంది. మద్యం సీసాల వల్ల కలిగే అనర్థాలను పసిగట్టి మూగజీవాల కోసం రైతుల కోసం విచ్చలవిడిగా పంట పొలాల్లో మద్యం సీసాలను వేయకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పొలాల్లో తాగిపడేసిన మద్యం సీసాలు

ఐకేపీ వీవోఏకు సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్
కామారెడ్డి మండలంలోని ఉగ్రవాయి మైసమ్మ గుడి దగ్గర ఐకెపి వివోఏ ఉద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పఠాన్ గౌస్ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించి పుట్టినరోజు వేడుకను ఘనంగా జరుపుకున్నారు. కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మాలోత్ శివరాం నాయక్, మాచారెడ్డి మండలాధ్యక్షుడు అంకం కిషోర్ కుమార్, నాగిరెడ్డిపేట్ మండలాధ్యక్షుడు మల్లేష్ యాదవ్, లింగంపేట్ మండలాధ్యక్షుడు కోర్పుల్ పోషన్న, తాడ్వాయి మండల నాయకుడు, జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మాజీవాడి మోహన్‌రావు, గాంధారి మండల నాయకుడు, జిల్లా ఉపాధ్యక్షుడు మాధవపల్లి గోపాలరావు, రాజంపేట్ మండల నాయకుడు జిల్లా కార్యదర్శి అన్నారం రమేష్, జిల్లా కార్యదర్శి అశోక్ ముదిరాజ్, సదాశివనగర్ మండల నాయకుడు, జిల్లా కార్యదర్శి మల్లుపేట నరేష్ యాదవ్, జిల్లా నాయకుడు గొలిలింగల దావీద్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పండితుల సర్టిఫికెట్ల పరిశీలన


వెరిఫికేషన్ కౌంటర్లను పరిశీలిస్తున్న డీఈవో, పండిత పరిషత్ ఆర్‌యుపిపిటి నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి
భాషా పండితుల పోస్టులు అప్‌గ్రేడేషన్ అయిన సందర్భంగా పండితుల పోస్టులను పండితులకే ప్రమోషన్‌తో ఇచ్చేందుకు ఆదివారం విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. దీంట్లో భాగంగా తెలుగు, హిందీ, ఉర్దూ, పీఈటిల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేశారు. ఈ వెరిఫికేషన్ ప్రక్రియను డీఈవో పరిశీలించారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆర్‌యుపిపిటి రాష్ట్ర శాఖ ఉపాధ్యాక్షులు గఫూర్ శిక్షక్, జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్ తగు సూచనలను చేశారు.

నేటి నుంచి జీలుగ విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ-సదాశివనగర్
మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ రైతువేదికలో సోమవారం నుంచి జీలుగా విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఎ.ఈ.ఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాపాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకుని రావాలని సూచించారు. జీలుగా 30 కేజీల బస్తా ధర రూ.1116 ఉందని వివరించారు.

సరిహద్దు ప్రాంతాల్లో కాంగ్రెస్ హవా

- మూడు ఎంపి స్థానాలు కాంగ్రెస్ వశం

నవతెలంగాణ-మద్నూర్
ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మూడు రాష్ట్రాలైన తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక ఈ మూడు సరిహద్దు ప్రాంతాల ఎంపి స్థానాల్లో కాంగ్రెస్ హవా కొనసాగింది. మూడు రాష్ట్రాలకు పూర్తిగా సరిహద్దు ఎంపి స్థానాలు తెలంగాణలోని జహీరాబాద్ ఎంపి స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్, మహారాష్ట్రలోని నాందేడ్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ అభ్యర్థి వసంతరావు చౌహన్, కర్ణాటకలోని బీదర్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సాగర్ కాండ్రే గెలుపొందారు. ఈ విధంగా మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఎంపీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ వశం చేసుకోవడం విశేషం. సరిహద్దు ప్రాంతాల్లో కనిపించిన కాంగ్రెస్ పార్టీ హవా రాష్ట్రాల ప్రాంతాల్లో అంతంత మాత్రంగానే ఉండటం అధికారంలోకి రాలేకపోయింది. సరిహద్దు ప్రాంతాల అభ్యర్థుల గెలుపునకు కాంగ్రెస్ పార్టీ కృషి ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలే పట్టుదలతో గెలిపించారని చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి. మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో మూడు ఎంపీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ పట్టుదలతో అభ్యర్థులను గెలిపించుకోవడం విశేషం.



ఏకరూప దుస్తులు అందజేత


ఏకరూప దుస్తులు అందజేస్తున్న డిఆర్‌డిఏ పిడి సాయగౌడ్

నవతెలంగాణ-ఎడపల్లి
ప్రభుత్వ పాఠశాలలో బాలబాలికలకు డిఆర్‌డిఏ పిడి సాయగౌడ్ ఏకరూప దుస్తులను ఆదివారం అందజేశారు. మండలంలోని నెహ్రూనగర్, జానకంపేట్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న బాలబాలికలకు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఆయన బాలికలకు అందజేశారు. ఈ సందర్భంగా సాయగౌడ్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో బాలబాలికలకు నాణ్యమైన బోధనతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తుందన్నారు. బాలబాలికలకు నాణ్యమైన బోధన బోధిస్తారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం సాయిలు, వైస్ ఎంపీపీ ఇమ్రాన్ ఖాన్, జానకంపేట్ ఎంపీటీసీ సభ్యులు మంద సంజీవ్ కుమార్, ఐకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, రెండు గ్రామాల వీవోఏలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉద్యోగుల నివాసాలు


శిథిలావస్థకు చేరిన భవనం

నవతెలంగాణ-బోధన్
బోధన్ మండల పరిషత్ కార్యాలయం సమీపంలో గత కొన్ని సంవత్సరాల నుంచి ఉద్యోగుల నివాస గృహాలు శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వ శాఖల్లో పనిచేసిన ఉద్యోగులు గతంలో ప్రభుత్వ క్వార్టర్లలోనే నివాసం ఉండి విధులకు హాజరయ్యేవారు. కానీ అవి కొన్నేళ్ల నుంచి వాడకంలో లేకపోవడంతో నేడు అవి శిథిలావస్థకు చేరాయి. వాటి కిటికీలు, తలుపులు చోరీకి గురవడంతో పిచ్చి మొక్కలు పెరిగి నిరుపయోగంగా మారాయి. దాంతో అవి ఆకతాయిలకు అడ్డాగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఈ శిథిలావస్థకు చేరిన గృహాలను తొలగించి ఈ స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణాలకు ఉపయోగిస్తే ప్రజలకు అనుకూలంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వృథాగా తాగునీరు

- మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- పట్టించుకోని గ్రామ ప్రత్యేకాధికారి, గ్రామపంచాయతీ సిబ్బంది

నవతెలంగాణ-ఎడపల్లి
పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా సంబంధిత ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ గ్రామ ప్రత్యేక అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది పట్టించుకోవడంలేదని ఆరోపణలు కాలనీ వాసులనుంచి వినిపిస్తున్నాయి. మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో మూడో వార్డు కాలనీలో ప్రభుత్వ కులాయి వద్ద నీరు వృథాగా పోతుంది. మురికి కాలువలలో పిచ్చిగడ్డి ఏపుగా పెరిగిపోయింది. ఎగువ ప్రాంతం నుంచి మురికి కాలువ నీరు కింది భాగాన సరఫరా కాకపోవడంతో మురికి నీరు తటస్థంగా నిలిచిపోతుంది. గ్రామపంచాయతీ అధికారులకు కాలనీవాసులు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది మురికి కాలువలను శుభ్రం చేయడంలో శ్రద్ధ చూపకపోవడం పట్ల కాలనీవాసులు తీవ్రంగా మండిపడుతున్నారు. వెంటనే కాలనీలో ఉన్న కులాయికి మరమ్మతులు జరిపించి ట్యాప్‌ను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఎడపల్లి ఎంపీడీవో శంకర్, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేస్తామని కాలనీవాసులు తెలిపారు.


మురికి కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు..


వృథాగా పోతున్న నీరు

కామారెడ్డి అభివృద్ధికై కలిసి నడుద్దాం

- ట్యాక్సులు, పార్కింగ్, ఓపెన్ ప్లాట్ల విషయంలో కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటాం
- రాష్ట్రంలో ఇతర పట్టణాలు మనల్ని ఆదర్శంగా తీసుకోవాలి
- అన్ని వర్గాల వ్యాపారస్తులు సహకరిస్తే అభివృద్ధి సాధ్యం
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి


మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే

నవతెలంగాణ-కామారెడ్డి
కామారెడ్డి అభివృద్ధికై కలిసి నడుద్దామని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి పిలుపునిచ్చారు. కామారెడ్డి పట్టణం సమూల అభివృద్ధి కోసమై పట్టణంలోని అన్ని రంగాల వ్యాపారస్తులతో రాజారెడ్డి గార్డెన్స్‌లో కామారెడ్డి అభివృద్ధి శంఖారావం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని అన్ని రకాల వ్యాపారస్తులు హాజరై తమ సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణ అభివృద్ధి విషయంలో తాను అనుకుంటున్న విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూయించి అందరికీ అర్థంయ్యేలా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

కామారెడ్డి అభివృద్ధికై కలిసి నడుద్దామని అన్నారు. అభివృద్ధి విషయంలో ట్యాక్సులు, పార్కింగ్, ఓపెన్ ప్లాట్లకు సంబంధించి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటామని ప్రజలు సహకరించాలని అన్నారు. రాష్ట్రంలో ఇతర పట్టణాలు మనల్ని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. అన్ని వర్గాల వ్యాపారస్తులు సహకరిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అవినీతి కారణంగానే కామారెడ్డి అభివృద్ధి కుంటుపడిందని గుర్తుచేశారు. అభివృద్ధి విషయంలో సలహాలు, సూచనలు ఇవ్వాలని అన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్
మండలంలోని ఆయా గ్రామాలలో పదో తరగతి, 12వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ఆదివారం జిల్లా నాయక్ పోడ్ ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. లింగంపల్లి గ్రామ సమీపంలోని డిపిఎల్ గార్డెన్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించినందుకు వారిని ఇతర విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు రాజకీయ, ఉద్యోగ రంగాల్లో ముందుండాలన్నారు. జాతి జాగృతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సాయిలు, మన్నెరాం గోపాల్, పుట్ట వెంకట్, బాలు, అశోక్, పెంటయ్య, సాయిలు నాయకపోడు సంఘం సభ్యులు పాల్గొన్నారు.


సన్మానం పొందిన విద్యార్థులతో నాయకపోడు ఉద్యోగ సంఘం నాయకులు

రామోజీరావుకు నివాళులర్పించిన పాత్రికేయులు


ఎడపల్లి: రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాత్రికేయులు

నవతెలంగాణ-ఎడపల్లి/రెంజల్
ఈనాడు దినపత్రిక, ఈటీవీ, రామోజీరావు ఫిలింసిటీ అధినేత రామోజీరావు మృతి పట్ల ఎడపల్లి మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, ఏపీయూడబ్ల్యూజే నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నీల నాగరాజు గుప్తా, ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా పాత్రికేయులు భుజంగం లింగం, సాయిరెడ్డి, విజయ్‌గౌడ్, ఓం ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతి పట్ల సిపిఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో వారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి ఆయన అందించిన సేవలను వారు కొనియాడారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసిన తమకు అన్ని విధాలుగా చేయూతను అందించారని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ జిల్లా నాయకులు పుట్టి నడిపి నాగన్న, మండల అధ్యక్షులు వడ్డెన్న, మండల ప్రధాన కార్యదర్శి ఎస్కే నజీర్, ఎల్.గంగాధర్, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.


రెంజల్‌లో...